



మించాల సాంబశివరావుకు చైర్మన్ నియామక పత్రం అందిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య యాదవ్ తదితరులు

- మించాల సాంబశివరావునే వరించిన పదవి
- అధిష్ఠానం ఇచ్చిన పేరును ప్రకటించిన ఇన్‌చార్జి మంత్రి కొలుసు
- తనకు అన్యాయం జరిగిందంటూ సుబ్బయ్య ఆవేదన
- ఫలించిన బుజ్జగింపులు.... కలిసి పనిచేసేందుకు సుముఖత

మించాలకే మున్సిపల్ పీఠం

చీరాల మున్సిపల్ పీఠం ఏకగ్రీవంగా టీడీపీ ఖాతాలోకి



చేతులెత్తి ఆమోదం తెలుపుతున్న కౌన్సిలర్లు...చిత్రంలో ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే కొండయ్య

బాపట్ల, చీరాల(ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠ వీడింది...చీరాల మున్సిపల్ చైర్మన్ పీఠం 19వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబ శివరావునే వరించింది. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మించాల సాంబశివరావు చైర్మన్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా, ఎమ్మెల్యే కొండయ్యతో పాటు 25 మంది కౌన్సిలర్లు మించాలకు అనుకూలంగా చేతులెత్తగా ఏకగ్రీవంగా చైర్మన్ పీఠం టీడీపీ ఖాతాలో పడింది. దీనికి ముందుగానే ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి కౌన్సిలర్లతో సమావేశం అయి అధిష్ఠానం పంపిన పేరుగా మించాల సాంబశివరావును ప్రక టించారు. చైర్మన్ పదవి కోసం చివరి వరకు పోటీపడిన పొత్తూరు సుబ్బయ్య తనకు అన్యా యం జరిగిందని మున్సిపల్ కార్యాలయం నుం చి బయటకు వెళ్లిపోయారు. మొత్తం 25 మంది కౌన్సిలర్లు ఎన్నికలో పాల్గొనగా 8 మంది దూరంగా ఉన్నారు. చైర్మన్ ఎన్నిక అంకం సజా వుగా ముగియగా, వైస్ చైర్మన్ ఎన్నిక గురువా రానికి వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు

కలిసొచ్చిన సామాజిక సమీకరణాలు

చీరాల మున్సిపల్ చైర్మన్ పదవి మించాలను వరించడం వెనక సామాజిక సమీకరణాలు కూడా కలిసొచ్చినట్లు సమాచారం. సమీకరణాల్లో భాగంగా బీసీ(యాదవ) సామాజిక వర్గానికి చెందిన ఆయనపైనే టీడీపీ అధిష్ఠానం మొగ్గు చూపింది. ఈ సందర్భంగా టీడీపీలోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే అంశం ఈ ఎంపిక ద్వారా మరోసారి నిరూపితమైందనే అభిప్రాయాన్ని నేతలు వెలిబుచ్చడం గమనార్హం. అవిశ్వాసం ద్వారా చైర్మన్ పీఠం నుంచి వైదొలగిన జంజనం శ్రీనివాసరావు కూడా బీసీ వర్గీయుడే కావడం, మళ్లీ చైర్మన్ పదవి భర్తీని బీసీలకు కేటాయించడమే సముచితమనే అభిప్రాయానికి అధిష్ఠానం రావడం వల్లే మించాల సాంబశివరావును చైర్మన్ పదవి వరించిందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.

25 మంది హాజరు...8 మంది దూరంగా..

టీడీపీకి 21 కౌన్సిలర్ల మద్దతు ఉండగా, చైర్మన్ పదవి ఆశించిన సుబ్బయ్య అసంతృప్తితో కౌన్సిల్ హాలు నుంచి (మిగతా 6లో)



సంతమాగులూరులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, రవికుమార్

పొగాకు మొత్తం

కొనుగోలు చేస్తాం

ఈ ఏడాది నల్లబర్లీ సాగు వద్దు

- ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తాం
- రైతులతో రాజకీయం చేయాలని చూస్తోన్న వైసీపీ
- సంతమాగులూరులో మంత్రులు అచ్చెన్నాయుడు, రవికుమార్

బల్లికురవ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న పొగాను మార్క్‌ఫైడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రైతులు అధిక శాతం ఈ ఏడాది పొగాకు సాగు చేశారని దీంతో వారి ఇబ్బందులను గమనించి ముఖ్యమంత్రి నారా చంద్రాబునాయుడు రైతుల వద్ద ఉన్న పొగాను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. రైతుల వద్ద ఉన్న మెదటి రకం పొగాకు క్వింటాకు రూ. 12 వేలకు, రెండో రకం రూ. 9 వేలకు, మూడో రకం రూ. 6 వేల వంతున కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద కొనుగోళ్ల చేస్తున్నారని, రైతులు ఈ విషయాన్ని గమనించి గ్రేడ్‌లుగా చేసుకుని అమ్మకాలు చేసుకోవాలన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పొగాకు, మామిడి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంటే అసలు కొనుగోలు చేయటం లేదని వైసీపీ నేతలు విమర్శలు చేయటం చూసి రైతులు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే రైతుల వద్ద ఉన్న నల్ల బర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు రూ. 270 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

ఈ ఏడాది రైతులు నల్లబర్లీ పొగాకును సాగు చేయవద్దు అని వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు రైతులకు విజ్ఞప్తి చేశారు. పొగాకు పంట వద్దు ఇతర పంటలు ముద్దు అనే నినాదంతో రైతుల వద్ద ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఆయన అధికారులను కోరారు. ఈ ఏడాది ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేయకుంటే రైతుల పరిస్థితి ఎలా ఉండేదో తలచుకుంటే బాధ వేస్తుందని రైతులు అర్థం చేసుకొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫైడ్ డీఎం కరుణశ్రీ, డీఏవో రామకృష్ణ, కె. శ్రీనివాసరావు, సంతమా గులూరు మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్లు తేలప్రోలు రమేష్, దేవినేని నరేంద్ర, ఏవోలు శ్రీనివాసరావు, సైదా తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు.. **బంగారు బాట**
అంగన్ వాడీలకు ఆధార్ శిల పుస్తకాలు పంపిణీ

వసతి.. వారెవ్వా
- కుక్కల కోసం ఏసీ హాస్టళ్లు
- ఆహ్లాదకరంగా డాగీస్ జోన్ల ఏర్పాటు
- నిద్రకు బెడ్లు.. ఆడుకునేందుకు బొమ్మలు



8

బాపట్ల టౌన్‌హాలుకు **120 వసంతాలు**
- 1913లో ప్రథమాంధ్ర మహాసభకు ఇదే వేదిక

మిర్చియార్డు పాలకవర్గం.. ఎప్పుడో?



- కొలిక్కిరాని కూర్పు.. నేతల్లో నిరుత్సాహం
- కమిటీ నియామకంలో 13 నెలలుగా జాప్యం

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండం లోనే అతి పెద్దది.. రాష్ట్రంలోనే పెద్దమొత్తంలో స్థిరాస్తులు, వార్షిక ఆదాయం.. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమి టీ (మిర్చియార్డు) కలిగి ఉన్నది. అయితే ఇంతటి ప్రాధా న్యం ఉన్న మిర్చియార్డుకు పాలకవ ర్గాన్ని నియమిం చడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచిపోయింది. అయినా మిర్చియార్డు విషయంలో ఒక నిర్ణయానికి రాలేక పోతున్నది. సాధారణంగా మార్కెట్ కమిటీ పదవీకాలం ఏడాదిగా నిర్ణ యించారు. కమిటీలో చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు పది మంది సభ్యులకు చోటు కల్పించొచ్చు. ఐదేళ్ల పాటు పాలకవర్గాలను నియమిస్తే 50 మంది పార్టీ కార్య కర్తలకు పదవులు ఇవ్వొచ్చు. అలాంటిది ఇప్పటికే ఏడాది ముగిసిపోయిన దృష్ట్యా ఇప్పటి నుంచి వరుసగా నియ మిస్తే 40 మందికే పదవులు ఇచ్చి గౌరవించొచ్చు. ఇంకాస్త ఆలస్యం చేస్తే ఈ సంఖ్య కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నామినేటెడ్ పద వుల్లో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవికి ఎంతో డిమాండ్ ఉన్నది. ఇందుకు కారణం ఈ మార్కెట్ కమిటీకి దేశ, విదేశాల్లో పేరు, ప్రఖ్యాతలు గడించడమే. ఏటా రాష్ట్రంలోని మిర్చి పండించే జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా రైతులు ఇక్కడ మిర్చిని విక్రయించడానికి వస్తుంటారు. అలానే పత్తి సీజన్‌లోనూ సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఈ విధంగా యార్డుకు మా ర్కెట్ ఫీజు రూపంలో రూ.100కోట్లకు పైగా ఆదాయం ఏటా సమకూ రుతుంది. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు, రైతులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు అవకాశం ఉన్నది. ఇక మిర్చి టర్నోవర్ అయితే ఏకంగా రూ.15 వేల కోట్లకు పైగా జరుగుతుంది.

గతంలోనూ ఇలానే నాన్చుడు

2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా మిర్చి యార్డు పాలకవర్గాన్ని వెంటనే నియమించలేదు. పార్టీ అధికారంలోకి వచ్చిన ఇంచుమించు రెండేళ్ల తర్వాత కమిటీని ఏర్పాటు చేసింది. ఆ విధంగా రెండో విడత కమిటీని నియమించే సరికి 2019 ఎన్నికల వాతావరణం వచ్చేసింది. దాంతో రెండో విడతలో పదవులు పొందిన నాయకులు పట్టుమని పది నెలలైనా పాలకవర్గంలో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కమిటీని నియమించడానికి ఎలాంటి కోర్టు అడ్డంకులు లేవు. పార్టీలో ఏకాభిప్రాయం మాత్రమే కుదరాలి. ప్రభుత్వంలో టీడీపీతో జనసేన, బీజేపీ కూడా భాగస్వామ్యమై ఉన్నందున దామాషా ప్రకారం ఆ పార్టీలకు చెందిన నాయకులకు కూడా ఒకటి రెండు పదవులు కమిటీలో ఇస్తే సరిపోతుంది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావడంతో ఆశావహులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా నాయకత్వం రాష్ట్ర నేతల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పాలకవర్గం నియమిస్తే కొంతమందికి పదవులు ఇచ్చి న్యాయం చేసినట్లు అవుతుంది.

కాల్వలకు నీరు.. విస్తృతంగా సాగు

వెద సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు



పీటీ ఛానల్‌లో ప్రవహిస్తున్న సాగునీరు



అప్పికట్ల గ్రామంలో వెద పైరు

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాల్వలు సాగునీటి ప్రవాహంతో కళకళలా డుతున్నాయి. విస్తృతంగా సాగుతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో ఈ ఏడాది రైతులు వెదసాగుకు ఆసక్తి చూపుతున్నారు. నారు పెంచి నాట్లు వేస్తే సాగు ఆలస్యమవుతుందని రైతులు ముందస్తుగానే వెద పెడుతున్నారు. పీటీ ఛానల్‌కు 120 నుంచి 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తిమ్మరాజు కాల్వ ద్వారా కూడా సాగునీటి సరఫరా అవుతోంది. దీంతో రైతులు ఉత్సాహంగా వెదపెడుతున్నారు. అప్పికట్ల, చుండూరుపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే వెద పెట్టిన పొలాలు పచ్చని పైరుతో కళకళలాడుతున్నాయి. తీరప్రాంతంలోని ఇసుక భూముల్లో కూడా వెద పెట్టారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికి కాల్వల్లో నీరు రావడంతో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులుండవని ఇరిగేషన్ అధికారులు భరోసా ఇవ్వడంతో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. అక్కడక్కడ కొంతమంది రైతులు వరినారు పెంచుతున్నారు.

మూత బడిలు

ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి.. ఇక పాఠశాలల్లో కొరత ఉండదు.. విద్యార్థులకు ఇబ్బందులు తప్పినట్లే.. అని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు భావించాయి. అయితే ఇందుకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పాఠశాలల్లో పరిస్థితి నెలకొంది. అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూతపడుతున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో తలుపులు ఆయాలే తీయాల్సి వస్తోంది.



- ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 120
- 25 పాఠశాలల్లో తలుపులు తీస్తున్న ఆయాలు
- క్లస్టర్లలో ఖాళీగా 200 మందికి పైగా ఉపాధ్యాయులు
- ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

రేపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా.. బదిలీలు పూర్తిఅయి నెల గడిచినా ఇంకా అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాల్లో గందరగోళ పరిస్థితులే ఉన్నాయి. ప్రధానంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో అయితే పరిస్థితి దారుణంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 120కి పైగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. కొంతమంది ఉపాధ్యాయులు బదిలీల్లో వ్యూహాత్మకంగా క్లస్టర్లను కోరుకుని దూర ప్రాంతాల్లోని పాఠ శాలలకు బదిలీపై వెళ్లకుండా తప్పించు కున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసి కూడా విద్యాశాఖ అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నారని అందువల్లే పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూత పడే పరిస్థితి వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇటీవల దాదాపు 5,000 మందికి పైగా ఉపాధ్యాయులకు బదిలీలు జరిగినా ఇంకా అనేక పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరు. దీనిని బట్టి ఉపాధ్యాయ బదిలీలు ఏవిధంగా జరిగాయో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉపాధ్యా యులు లేక పాఠశాలలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా వెల్దుర్తి, బెల్లంకొండ, పిడుగురాళ్ల తదితర మండలాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రం గా ఉన్నట్లు సమాచారం. బదిలీల సందర్భంగా ఇతర ప్రాంతంలోని పాఠశాలకు వెళ్లిన వారు అక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటే మిగిలిన వారు పాత స్థానాలకు రావాలి. అయితే అనేకమంది ఉపాధ్యాయులు పాత స్థానాలకు రాకపోవడంతో కొరత నెలకొందని సంఘాల నాయకులు తెలిపారు. పల్నాడు జిల్లాలోని 25 పాఠశాలల్లో ఆయాలే తలుపులు తీస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయుల కొరతపై పల్నాడు జిల్లాలోని ఓ ఎంఈవో విద్యాశాఖ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లారు. వెల్దుర్తి, బొల్లాపల్లి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయులు లేక పాఠశాలలు (మిగతా 6లో)

జాతీయ అవార్డు..

చేనేతలకు అంకితం : కలెక్టర్

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఒక జిల్లా ఒక ఉత్పత్తి పేరుతో కుప్పడం పట్టు చీరలకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన జాతీయ స్థాయి అవార్డును చీరాల చేనేతలకు అంకితం చేస్తున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి ప్రకటించారు. కుప్పడం పట్టుచీరలకు కేంద్రం ఇచ్చిన జాతీయ స్థాయి అవార్డును అందుకొని బాపట్ల విచ్చేసిన కలెక్టర్‌ను బుధవారం వివిధశాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శతాబ్దాలుగా చేనేత కృషి ఫలితమే కుప్పడం పట్టు చీరలకు ఢిల్లీలో జాతీయ స్థాయి గుర్తింపు ఉందన్నారు. కుప్పడం పట్టుచీరలను ఆన్‌లైన్ వ్యాపారవేదికకు అనుసంధానం చేయాలన్నారు. సూర్యలంకబీచ్,ఓడరేవు బీచ్ వద్ద, చీరాల పట్టణం, బాపట్లపట్టణంలోని ప్రధాన కూడలిలో కుప్పడం పట్టుచీరల ప్రదర్శన, అమ్మకాలు జరపాలన్నారు. పొదుపుసంఘాల ద్వారా సంబంధిత 4ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశమంతా ప్రాచుర్యం పొందిన కుప్పడం పట్టుచీరల ఉత్పత్తి విస్తృతం కావాలని,చేనేత కుటుంబాలలోని నిరుద్యోగులు ఆసక్తిగా చేనేత వృత్తిలోకి అడుగులు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సీపీవో షాలెంరాజు, డీపీవో ప్రభాకరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మీ, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియా, రామలక్ష్మీ, డీఎల్‌డీవో విజయలక్ష్మీ, అనుబంధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జాతీయ అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటమురళిని సన్మానిస్తున్న అధికారులు బృందం

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేదెప్పుడు

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆందోళన



మాట్లాడుతున్న ఎన్ వెంకటేశ్వర్లు

గుంటూరు(విద్య), 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు పూర్తై 45 రోజులు అయినా ఇంకా అనేకమంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. బదిలీలు చేసే ముందు ఆర్థికశాఖ అనుమతి తీసుకోవడం, క్యాడర్ స్ట్రెంత్ అప్డేట్ బాధ్యత తీసుకోవాల్సిన విద్యాశాఖ పట్టించుకోలేదన్నారు. ఫలితంగా ఉపాధ్యాయులకు జీతాలు అందలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్. సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, షకీలా బేగం, టీ ఆంజనేయులు, కే కేదార్‌నాథ్, కే ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లను ఆన్ డ్యూటీగా పరిగణించాలి

● పంచాయతీరాజ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న కూచిపూడి మోహన్‌రావు

గుంటూరు సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని లైన్ డిపార్ట్మెంట్స్‌లో ఉద్యోగుల డిప్యూటేషన్లను ఆన్ డ్యూటీగా పరిగణించాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కూచిపూడి మోహన్‌రావు తెలిపారు. బుధవారం గుంటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పూర్ణచంద్ర రెడ్డి, గుంటుపల్లి శ్రీనివాస్, శామ్యూల్ పాల్, నిర్మలభారతి, సీహెచ్ శ్రీనివాస్, మల్లేశ్వరరావు, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను వంచించిన జగన్ : ప్రత్తిపాటి విమర్శ

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎన్నో హామీలు ఇచ్చి ఐదేళ్ళు పాలన చేసిన జగన్ ఒక్కటీ నెరవేర్చకుండా వంచించారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ తన తప్పు ఒప్పుకుని తక్షణమే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం, వెలిగొండ. గుండ్రేవుల, గుండ్లకమ్మ, రాళ్లపాడు, సోమశిల, ఎత్తిపోతల పథకాలు ఎందుకు పూర్తిచేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గానికో కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తానని, రైతులకు పగటిపూట నాణ్యమైన 9 గంటల విద్యుత్ ఉచితంగా ఇస్తానని చెప్పి, ట్రూఅప్ ఛార్జీల పేరుతో బిల్లుల భారం మోపాడని విమర్శించారు. రూ.4 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయ నిధి, రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఏడాదిలో 80 శాతం హామీలు అమలు చేసిన చంద్రబాబును ఏ ముఖం పెట్టుకొని ప్రశ్నిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు.


కృష్ణానదిలో 1.14 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక దిబ్బలు

● గుంటూరు వైపున 74.78 లక్షల సీఎంలు
● ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలో 39.48 క్యూబిక్ మీటర్లు
● హైడ్రోగ్రాఫిక్ సర్వే ద్వారా గుర్తించిన కేసీ డివిజన్

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఇసుక దిబ్బలను గుర్తించేందుకు కృష్ణా రివర్ కన్జర్వేట్ డివిజన్ నిర్వహించిన హైడ్రోగ్రాఫిక్ సర్వేలో ఆశాజనక నివేదిక వచ్చింది. ప్రకాశం బ్యారేజ్ ఎగువున నిర్వహించిన ఈ సర్వే ద్వారా కోటికి పైగా క్యూబిక్ మీటర్ల ఇసుక దిబ్బలున్నట్లు తేలింది. ఈ నివేదికని ఇటీవలే ఆ శాఖ జిల్లా యంత్రాంగానికి నివేదించింది. అందులోనూ గుంటూరు జిల్లా వైపున ఎక్కువ మోతాదులో ఇసుక దిబ్బలు ఉండటం విశేషం. ఆ ఇసుకని బయటకు తీయడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి కొరత లేకుండా చూడొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించారు. సాధ్యమైనంత త్వరగా ఒక ఏజెన్సీని ఎంపిక చేసి బ్యారేజ్‌లో పేరుకుపోయిన ఇసుక నిల్వలను బయటకు తీయాలని మైనింగ్ అధికారులు కోరారు.

ప్రకాశం బ్యారేజ్‌లో పేరుకుపోయిన ఇసుక, మట్టి దిబ్బలను తొలగించాలన్న ప్రతిపాదన గత కొన్నేళ్లుగా ఉన్నది. అయితే ఇందుకు తగిన అనుమతులు లభించలేదు. దీని వలన నది అడుగు భాగం నుంచి దిబ్బలు పెరుగుతూ పైకి వచ్చి వరదనీటి ప్రవాహ వేగాన్ని మందగించేలా చేస్తున్నాయి. అలానే ప్రవాహ దిశను మారుస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు కురిసి కృష్ణానదికి 15 రోజులకు పైగా వరద ప్రవాహం పోటెత్తింది. అప్పట్లో గరిష్ఠ నీటి ప్రవాహం నమోదైంది. దాంతో కరకట్టకు ఎక్కడ ప్రమాదం వాటిల్లుతుందోనని అంతా ఆందోళన చెందారు. దీనిని పరిగణనలోకి తీసుకొన్న కేసీ డివిజన్ హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహణ చేపడతామని, అందుకు అయ్యే ఖర్చులు భరించాలని గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాలను కోరింది. అందుకు రెండు జిల్లాలు సమ్మతించడంతో హైడ్రోగ్రాఫిక్ సర్వేని నిర్వహించింది. ఇందుకోసం రూ. 48 లక్షలు ఖర్చు కాగా రూ. 24 లక్షల చొప్పున రెండు జిల్లాలు చెల్లించాయి.

సర్వే నిర్వహించిన బీఎస్‌పీ హైడ్రో డ్రెడ్జింగ్ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కోటి 14 లక్షల 26 వేల 836.10 క్యూబిక్ మీటర్ల ఇసుక, మట్టి దిబ్బలు ఉన్నట్లు గుర్తించింది. ఇందులో గుంటూరు జిల్లా వైపున 74 లక్షల 78 వేల 627.30 క్యూబిక్‌మీటర్లు, ఎన్‌టీఆర్ జిల్లా వైపున 39 లక్షల 48 వేల 208.80 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలున్నట్లు నివేదించింది. ఈ సర్వేని అత్యంత శాస్త్రీయంగా నిర్వహించారు. పడవలను ఉపయోగించి ఎకో సౌండింగ్ ద్వారా నిర్వహించి ఇసుక నిల్వలను అంచనా వేశారు. అమరావతి రాజధాని అవసరాలకు ఇసుక భారీ మోతాదులో అవసరం ఉన్న దృష్ట్యా నదిలో ఉన్న ఇసుకని తీసేందుకు ప్రభుత్వం ఒక ఏజెన్సీని ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టింది.



హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహించే విధానం

విద్యుదుత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

సిబ్బందితో హైడల్ డైరక్టర్ ఎం.సుజయ్‌కుమార్

రెంటచింతల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని, ఏపీ జెన్‌కో హైడల్(జలవిద్యుత్) డైరక్టర్ ఎం.సుజయ్‌కుమార్ తెలిపారు. సత్రశాలలోని సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులతో బుధవారం ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ రూమ్)లో ఆయన సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఏటా విద్యుదుత్పత్తి లక్ష్యం 78 ఎంయూలు కాగా ఈ సారి 80 ఎంయూలకు పెంచి 2026 మార్చి 26 లోపు ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ఈ ఏడాది 92.427 ఎంయూల విద్యుత్ తయారు చేశారని అభినందించారు. పదిహేను రోజుల నుంచి రెండు యూనిట్ల ద్వారా 4.47 ఎంయూల కరెంట్ తయారైనట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. 20 రేడియల్ క్రస్ట్‌గేట్లను పరిశీలించి లీకుల నివారణకు వ్యూహాన్ని అమలు చేయాలన్నారు. అన్ స్కిల్డ్ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు డైరక్టర్‌కు వివరించి క్యాడర్ ఉద్యోగులుగా మార్చాలని కోరారు. రూ.4 లక్షలతో జిమ్ కేంద్రాన్ని ప్రారంభించారు. రిజర్వాయర్ సమీపంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఈలు రవీంద్రారెడ్డి, జి.తిరుమల ప్రసాద్, నాగరాజు, చంద్రశేఖర్, జీఎం శ్రీనివాసరావు, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, వైఎస్ఆర్‌కే ప్రసాద్, ఏడీఈలు వెంకట రత్తయ్య, జయశంకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీర్లతో మాట్లాడుతున్న హైడల్ డైరక్టర్ ఎం.సుజయ్‌కుమార్

ఎంఎస్ఎంఈల సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్ చైర్మన్‌కు రాష్ట్ర లఘు ఉద్యోగ భారతి కమిటీ విజ్ఞప్తి

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావును మంగళగిరిలోని కార్యాలయంలో బుధవారం లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు తులసి యోగీష్ చంద్ర ఆధ్వర్యంలోని రాష్ట్ర కమిటీ కలిసింది. పారిశ్రామికులకు అధిక విద్యుత్ చార్జీలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, ఆర్థిక సహాయం పొందటంలో ఇబ్బందులు, మెమొరాండం ఆఫ్ టైటిల్ డీడ్ (ఎంఓడీటీ) పై అధికంగా చార్జీలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కోశాధికారి ధరణీష్, ఉపాధ్యక్షులు కమల్ నయన్ భాంగ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి తోట రామకృష్ణ, ఈసీ సభ్యులు విఠల్ ప్రసాద్ ఉన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూ కమిటీ ఒక వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు నూతన రాష్ట్ర కమిటీకి అభినందనలు తెలుపుతూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తులసి యోగీష్ చంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.



ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న లఘు ఉద్యోగ భారతీ నాయకులు

విద్యుత్ భారాలపై దశలవారీ ఆందోళనలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలనే డిమాండ్లతో ప్రభుత్వంపై దశలవారీ ఆందోళనలు చేపడు తున్నట్టు వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు స్పష్టం చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ ఒప్పందాలకు వ్యతిరేకంగా బుధవారం, మల్లయ్య లింగం భవన్లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అకిటి అరుణ్‌కుమార్, లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, వై నేతాజీలు మాట్లాడుతూ ఆందోళనల్లో భాగంగా గురువారం నుంచి 22వ తేదీ వరకు సదస్సులు, 22 నుంచి 29 వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, 30 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు కాలనీ సమావే శాలు, 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 7న ప్రత్యేక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తునట్టు పేర్కొన్నారు. ఆందోళనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఏఐటీ యూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఏరువాక కార్మిక సంఘ నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మించాలకే మున్సిపల్ పీఠం

(5వ పేజీ తరువాయి)

బయటకు వెళ్లిపోగా 20 మంది టీడీపీకి మద్దతిచ్చిన కౌన్సిలర్లు, 5 గురు ఆమంచి వర్గీయులు, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే కొండయ్యతో కలుపుకుని మొత్తం 27 మంది మించాలకు అనుకూలంగా ఓటేయ డంతో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు చైర్మన్‌గా సాంబశివరావు ఎన్నికైనట్లు ప్రకటించి బాధ్య తలు అప్పజెప్పారు. వైస్ చైర్మన్ ఎన్నిక గురు వారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు

ఫలించిన బుజ్జగింపులు

ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్యలు కౌన్సిలర్ పొత్తూరు సుబ్బయ్య ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించారు. పార్టీలో భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు ఉంటాయని, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని సుబ్బయ్యకు నేతలు వివరించారు. చైర్మన్ మించాలతో కలిసి పట్టణ అభివృద్ధికి పనిచేయాలని కోరారు. దీనితో మెత్తబడిన ఆయన సాయంత్రం చీరాల పార్టీ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌కు హాజరవడంతో కథ సుఖాంతమైంది.

19 నుంచి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దామచర్ల శ్రీనివాస్, తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో 52వ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దామచర్ల శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. అండర్-11 నుంచి సీనియర్స్ వరకు అన్ని విభాగాలతో పాటు, మాస్టర్స్ విభాగంలో అండర్-35+ నుంచి 70+ వరకు ఈ పోటీలు నిర్వహిస్తునట్టు పేర్కొ న్నారు. గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు స్టేడియంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరావు, సతీష్ చంద్ర, కార్యదర్శి రాము, రమేష్, భాషా తదితరులు పాల్గొన్నారు.

53,535 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 55,232 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,535 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,175 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13400	273	---	----
4884	---	----	341	10000	13500
సూపర్ 10	10000	13000	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	10000	13600
షార్క్-1	10000	12200	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4600	7000

పోలీస్ విచారణకు హాజరైన గుంటూరు మాజీ మేయర్ కావటి

యడ్లపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో విచారణకు గుంటూరు మాజీ మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు హాజరయ్యారు. మే 9న గుంటూరుకు చెందిన తన్నీరు రాజేష్, కారసాని వెంకటరత్నం(32) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ చెంగిజ్‌ఖాన్‌పేట వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం, గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి తల్లి పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మృతిపై ఆమె సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి, డీజీపీలకు కూడా ఫిర్యాదు చేశారు. మరణించిన తన కుమారుడు బతికి ఉన్నప్పుడు కావటి శివనాగ మనోహర్ నాయుడు వద్ద పని చేశాడని, మరణించిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కావటి శివనాగమనోహర్‌నాయుడు, రాజేష్‌లను విచారించారు. మృతుడితో వారికి ఉన్న సంబంధాలు, ఘటన జరిగిన రోజున వారు ఎక్కడ ఉన్నారనే వివరాలతో పాటు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించారు. నిందితుల నుంచి సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని రూరల్ సీఐ సుబ్బనాయుడు తెలిపారు

టిడ్కోపై నుంచి పడి వ్యక్తి మృతి



దాసరి బాలస్వామి (ఫైల్‌ఫొటో)

తెనాలి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగ్గడిగుంటపాలెం టిడ్కో భవనంపై నుంచి తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన దాసరిబాలస్వామి(20) అనే వ్యక్తి పడి మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్యాస్ కంపెనీలో డెలివ రీ బాయ్‌గా పనిచేసే బాలస్వామి మంగళవారం రాత్రి స్నేహితులను కలిసేందుకు టిడ్కో గృహాల వద్దకు వ చ్చాడు. ఈ క్రమంలోనే టిడ్కో భవనంపై ఉన్న ట్యాం క్‌పై కూర్చుని ప్రమాదవశాత్తు కిందకు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

విధుల నుంచి వార్డెన్ తొలగింపు

కారంపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మోడల్ స్కూల్ వార్డెన్ సౌరీబాయిని విధుల నుంచి తొలగించినట్లు ఎంఈవో-2 రవికుమార్ తెలిపారు.విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు డీఈవో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల బాధ్యతతో ఉండాలని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తమకు సమాచారం అందించాలని విద్యార్థినులకు ఆయన సూచించారు.

రెండు కార్లు ఢీ.. వ్యక్తి మృతి

తాడికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నిడుముక్కలలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మ్యారేజ్‌బ్యూరోలో పనిచేసే నలుగురు మహిళలు కారులో గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో అమరావతి నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు నిడుముక్కల దాటిన తర్వాత ఢీకొన్నాయి. గుంటూరు నుంచి వస్తున్న కారు డ్రైవర్ విజయవాడ యనమదలకుదురు గ్రామానికి చెందిన తాడంకి నాగేంద్రబాబు(36) అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు కార్లు స్పీడ్ మీద ఉండటంతో మృతుడు నాగేంద్రబాబు కారులో ఇరుక్కుపోయాడు. కారులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయటానికి గంటకుపైగా సమయం పట్టింది. అదే కారులో ప్రయాణిస్తున్న సీహెచ్.నవ్య, బీ.లక్ష్మీత్రివేణి, ఎల్.యశోధకృష్ణ, పీ.రజితలకు గాయాలయ్యాయి. 108లో వారిని గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అమరావతి నుంచి వస్తున్న కారు డ్రైవర్ వివరాలు తెలియరాలేదు.

మూతబడిలు

(5వ పేజీ తరువాయి)

మూతపడే పరిస్థితి ఉందని అధికారులకు తెలియజేశారు.వెంటనే కొంత మంది ఉపాధ్యాయులను కొన్ని పాఠశాలల్లో అధికారులు సర్దుబాటు చేశారు.

వలంటీర్లను నియమించినా..

మూడు జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడే పరిస్థితులు నెలకొనడంతో కొన్ని ప్రాంతాల్లో వలంటీర్లతో సరిపెడుతున్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు సహకారంతో విద్యా వలంటీర్లను నియమించిన అత్యధిక పాఠశాలల్లో ఇంకా ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉంది. వెల్దుర్తి మండల పరిధిలోని పాఠశాలల్లో అసిస్ట్ అనే సంస్థ 16 మంది విద్యా వలంటీర్లను నియమించిందని వెల్దుర్తి ఇన్చార్జి ఎంఈవో ఖాసిం తెలిపారు. వారికి నెలకు రూ.8000 చెల్లించేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు.

క్లస్టర్లలో ఖాళీగా ఉపాధ్యాయులు

బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని క్లస్టర్ పరిధిలో ఖాళీలను కోరుకుని అతి తెలివి ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడాల్సి ఉండగా క్లస్టర్ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు ఒక క్లస్టర్ పరిధిలో పదిమంది ఉపాధ్యా యులు ఉంటే ఆ క్లస్టర్లో పరి ధిలోని పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే అక్కడికి వెళ్లి పాఠాలు బోధించాలి. అయి తే దాదాపు 200 మందికి పైగా ఉపాధ్యాయులు క్లస్టర్లలో ఖాళీగా ఉంటూ కాలం వెళ్లదీస్తున్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. గుంటూరు నగరం నుంచి మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు దాదాపు 30 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇందులో పదిమంది క్లస్టర్ ఉపాధ్యాయులు ఉన్నారు. బదిలీ అయిన క్లస్టర్ ఉపాధ్యాయుల్లో ఇద్దరు మాత్రమే విధుల్లో చేరగా ఎనిమిది మంది విధుల్లో చేరలేదు. సాక్షాత్తు విద్యామంత్రి లోకేశ్ ప్రాతినిథ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లోనే ఇలా ఉందంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పురపాలక సంఘానికి కంపెక్టర్ మంజూరు


బాపట్ల పురపాలక సంఘానికి మంజూరైన 32 మెట్రిక్ టన్నుల కంపెక్టర్

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సేకరించిన చెత్తను ప్రతిరోజు జిందాల్‌కు తరలించేందుకు అనుకూలంగా ఉండే 32 మెట్రిక్ టన్నుల కంపెక్టర్ మంజూరైంది. ఇప్పటి వరకు బాపట్ల పురపాలకసంఘం పరిధిలో 5 మెట్రిక్ టన్నుల కంపెక్టర్‌లు రెండు మాత్రమే ఉండేవి. దీనివల్ల పట్టణంలో ప్రతిరోజు సేకరించే వ్యర్థాలను ఏ రోజుకు ఆ రోజు జిందాల్‌కు తరలించే అవకాశం లేక డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ నుంచి లారీలతో పంపిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారు కోటి16 లక్షల50వేల విలువ చేసే 32 మెట్రిక్ టన్నుల కంపెక్టర్‌ను 50 శాతం సబ్సిడీపై పురపాలక సంఘానికి మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11 మంజూరు కాగా అందులో బాపట్లకు ఒకటి రానుంది. 2021 సంవత్సరం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘ నిధులు బాపట్లకు 3 కోట్ల రూపాయలు మంజూరు కాగా అందులో 2 కోట్ల రూపాయలు పైపులైన్ పనులకు కేటాయించారు. కంపెక్టర్ సబ్సిడీ పోను మిగిలిన 50 శాతం 58లక్షల25వేల రూపాయలు ఆర్థిక సంఘ నిధులు నుంచి చెల్లించే ఏర్పాటు చేశారు. ఈవిధంగా పురపాలక సంఘానికి నూతన కంపెక్టర్ రావటం వల్ల ఏరోజు సేకరించిన చెత్తను అదేరోజు దీని ద్వారా జిందాల్ ప్లాంట్‌కు తరలించే అవకాశం ఉందని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు.

అంకితభావంతో పనిచేసే సిబ్బందిని కోల్పోవటం తీరనిలోటు : ఎస్పీ

● సంపూర్ణరావు కుటుంబానికి బీమా చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అంకితభావంతో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందిని కోల్పోవటం తీరనిలోటు అని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. బాపట్ల జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఈపూరుపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఐ ఎం.సంపూర్ణరావు కుటుంబానికి బుధవారం రూ.42 లక్షల బీమా చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణరావు కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మృతుడి భార్య మార్తమ్మను పరామర్శించి కుమారుడు పృధ్వీరాజ్, కుమార్తె మౌనిక చదువులు గురించి ఎస్పీ ఆరా తీశారు. కారుణ్య నియామక ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధితాధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఇతర బెనిఫిట్‌లు కూడా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయసారధి, వెల్ఫేర్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎంటీఆర్ఐ శ్రీకాంత్, మృతుని సోదరుడు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుకు 74వేల మెట్రిక్ టన్నుల పొగాకు : కలెక్టర్

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గతనెల 13వ తేదీ నుంచి బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ గోదాములలో సహకార సంఘాల ద్వారా, ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి పొగాకు కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో 11 మండలాలలో 74 వేల మెట్రిక్ టన్నుల పొగాకు ఇంకా ఉందన్నారు. దీనిని కొనుగోలు చేయటకు ప్రస్తుతం ఉన్న గోదాములు సరిపోయే పరిస్థితి లేదన్నారు. కొనుగోలు చేసిన పొగాకును స్టోరేజి చేయుటకు 10వేల చదరపు అడుగుల నుంచి లక్ష చదరపు అడుగులు, ఆపైన విస్తీర్ణం కలిగిన గోదాములు ఉన్న వారు అద్దెప్రాతిపదికన ఇచ్చేందుకు ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు.

ఆదర్శనీయమైన సేవలందిస్తున్న వ్యవసాయ కళాశాల

● నకాసా క్రాప్‌సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ జాగర్లమూడి

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది దశాబ్దాలుగా విద్యారంగంలోను, వ్యవసాయ రంగంలోను విశేష సేవలందిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల ఆదర్శనీయమైన పాత్ర పోషిస్తున్నదని నకాసా క్రాప్‌సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జాగర్లమూడి చంద్రశేఖర్ అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అగ్రి దీక్ష హాలులో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల ఉభయ రాష్ట్రాలలోని అనేక ఇతర కళాశాలల ఆవిర్భావానికి స్ఫూర్తిదాయకమైందన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి మాట్లాడుతూ ప్రపంచ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాపట్ల వ్యవసాయ కళాశాలలోనే బీజం పడిందన్నారు. కార్యక్రమంలో జెనిటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.తుషారాకు ఉత్తమ పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు బంగారు పతకాన్ని బహూకరించారు. డాక్టర్ బాలినేని వెంకటేశ్వర్లు, బాలినేని స్వరూపరాణి వెండి పతకాన్ని డి.మంజుషాకు బహూకరించారు. పలువురు పూర్వ అసోసియేషన్ డీన్‌లను సత్కరించారు. విశ్వవిద్యాలయ అధికారులు, పూర్వవిద్యార్థులు, పీహెచ్‌డీ, పీజీ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


కళాశాల ఎదుట విద్యార్థులు, అధ్యాపకులతో జాగర్లమూడి చంద్రశేఖర్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి రూ26 వేలకు తక్కువ కాకుండా జీతం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయ సమీపంలో సమ్మె చేస్తున్న కార్మికులకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించటం వల్ల ఏవిధమైన పథకాలు కూడా వర్తించటంలేదన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్మికులు అర్ధ నగ్నంగా మోకాళ్ళపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు, కొచ్చెర వినయ్‌రాజు, మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, సీఐటీయూ నాయకులు కె.శరత్, కార్మిక సంఘాల నాయకులు మురళికృష్ణ, హరిబాబు, రత్నం, నాని, అశోక్, ప్రమీల, నరేష్, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమ్మె శిబిరంలో అర్ధ నగ్నంతో నినాదాలు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

పిట్టలవానిపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వామికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు బుధవారం లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకలు రూ2,17,250 దేవస్థానానికి ఆదాయం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మండలపు గోపి పాల్గొన్నారు.

నేడు శ్రీబగళాముఖి అమ్మవారి హుండీ...

చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం ఉదయం లెక్కించటం జరుగుతుందని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను బహిరంగ వేలం నిర్వహించటం జరుగుతుందన్నారు.

నేడు దేవస్థానం భూములకు కౌలు వేలం

మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీలింగోద్భవస్వామి, శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానానికి సంబంధించిన మాగాణి భూములకు గురువారం సాయంత్రం 4 గంటలకు అమ్మవారి దేవస్థానంలో గల కల్యాణమండపంలో కౌలు వేలం నిర్వహించటం జరుగుతుందని జి.నరసింహమూర్తి తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను, మహిళలను ఆప్యాయంగా పలకరించి ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులు సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని వాటిని పరిష్కరిస్తామని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఎన్నో సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని, ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు అందిస్తుందన్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ నిధులు రూ.15 లక్షలతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల వెంకట కృష్ణారావు, రాంబాబు, నారాయణ, మల్లంపాటి హరి, యలవర్తి కోటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దివాకర్, తిరుపతి వెంకయ్య, పంచాయతీరాజ్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ పాపారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నేడు పెదపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు

అమృతలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నేడు పెదపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరుగుతుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కార్యాలయ వర్గాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందబాబు పాల్గొంటారని చెప్పారు.

జిల్లాలో ప్రాథమిక సర్వే నిర్వహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బంగారు కుటుంబాలు నీడ్‌బేస్డ్ ప్రాథమిక సర్వే కార్యక్రమం ఈనెల 21వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పీ4 కార్యక్రమం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పీ4 విధానంలో నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే నిర్వహించే ఉద్యోగులకు ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు శిక్షణలు జరుగుతున్నాయని చెప్పారు. శిక్షణలు ముగియగానే సర్వేలు ప్రారంభించాలన్నారు. ఆగస్టు 7 నుంచి 10వ తేదీ వరకు బంగారు కుటుంబాలు అదనపు చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగావకాశాలు, ఉద్యోగమేళాలు, కెరీయర్ గైడెన్స్ ఇచ్చేలా మార్గనిర్దేశం చేయాలన్నారు. నాణ్యమైన సేవలందించలేని మార్గదర్శియులను తొలగించాలని, బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించటం, వనరులను సమకూర్చే ప్రక్రియ వేగంగా చేయాలని పీ4 విధానం రాష్ట్రకమిటీ సభ్యుడు సంతోష్ చెప్పారు. నీడ్‌బెస్డ్ ప్రాథమిక సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. కేపీఐసీ అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఏపీటీఎఫ్ఆర్ 1.54 శాతం ఉండగా పెరుగుదల సాధారణ స్థాయికి చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో షాలెంరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యపై లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదు

● సీసీఎల్ఏ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యల వల్ల ఏ ఒక్క లబ్ధిదారుడు ఇబ్బంది పడకూడదని సీసీఎల్ఏ కమిషనర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. రాజధాని అమరావతి నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీసర్వే 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం నవంబరు మాసం నాటికి ప్రభుత్వ భూములన్ని రీసర్వే పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంలో వచ్చే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సీసీఎల్ఏ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సర్వేశాఖ, తహసీల్దార్‌లు ఆధార్ వెరిఫికేషన్ చేయాలన్నారు. జిల్లాలో 20 వేల ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉందని, మొత్తం మీద రాష్ట్రంలో 5 లక్షల 51 వేల ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ప్రతి మండల తహసీల్దార్‌లు ఈ విషయమై తగు చర్యలు తీసుకొని ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం అర్హత ఉండి జాయింట్ ఎల్‌పీఎం వలన అనర్హులుగా ఉన్న యెడల వాటిని ప్రత్యేకంగా హాజరై పరిష్కరించాలన్నారు. ప్రతి గ్రామంలోను, కాలనీలలోను ప్రభుత్వ భూములను గమనించి ఆ గ్రామాలకు శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీకాలనీలలో శ్మశాన వాటికలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కనకరాజు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలు నిర్వహించాలి : ఖాశీం

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ పాసిజానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు సంఘటితంగా నిర్వహించాలని ఉస్మానియా యూనివర్సిటి సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ సి.ఖాశీం పిలుపునిచ్చారు. బాపట్లలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం కారంచేడు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభ సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ 1985 జూలై 17న దళితుల నెత్తురు కారంచేడులో ఏరులై పారిందన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసి రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనలో మనువాద సంస్కృతి విస్తృత రూపం ధరించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విష్ణు, రాష్ట్ర నాయకులు జె.వెంకటేశ్వర్లు, నల్లమడ రైతు సంఘం నాయకులు కె.విజయ్‌కుమార్, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ అడే బుజ్జి, అఖిల భారత రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, కె.నాంచారయ్య, బి.పద్మ, కల్పన తదితరులు పాల్గొని ప్రసంగించారు.


‘తొలగించిన చోటే ఇల్లు కట్టించి ఇవ్వాలి’

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తొలగించిన చోటే ఇల్లు కట్టించి ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన తగరపు రవికుమార్ నివాసం, దుకాణాన్ని గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ కోసం తొలిగించారు. డ్రైనేజిపై స్లాబ్‌లు వేసి రోడ్డు విస్తరించారు. తిరిగి అదేప్రాంతంలో తమకు ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల నాయకులతో కలిసి మెడలో ముంత, నడుముకు తాటాకు కట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కమిషనర్ జి.రఘునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు, మాలమహానాడు రాష్ట్ర అధికారప్రతినిధి శీలం రోజన్‌బాబు, భీమ్‌ఆర్మీ బాపట్ల జిల్లా అధ్యక్షులు కొచ్చెర వినయ్‌రాజు, ఆలిండియా బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాగిత కోటేశ్వరరావు, ఆనంద్, కె.శరత్, తాళ్ళూరి రాజేష్ ఉన్నారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణ

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : భావపురి రియల్ ఎస్టేట్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొట్టు కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో బుధవారం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలో కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా నర్రా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా షేక్ సుభానీ, కోశాధికారిగా రత్తయ్యలను ఎన్నుకున్నారు. వీరితోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని అక్కడ జరిగిన సమావేశంలో అధ్యక్షుడు బొట్టు కృష్ణ మాట్లాడుతూ ఏజెంట్‌ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇన్సూరెన్స్‌తోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం సంతోషదాయకం


సహాయం అందిస్తున్న తాండ్ర సాంబశివరావు తదితరులు

కర్లపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో భాగంగా మాజీ సైనికులు అగ్నిప్రమాద బాధితులకు సహాయం అందించటం సంతోషదాయకమని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెం గ్రామంలో ఇటీవల సమ్మెట శ్రీనివాసరెడ్డి గృహం అగ్నికి ఆహుతి అవ్వటం వలన సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి బుధవారం రూ.12,500ను తాండ్ర సాంబశివరావు మాజీ సైనికులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చలికొండ వెంకటకృష్ణారావు, జనరల్ సెక్రటరి షేక్ మొహిద్దీన్, రాష్ట్ర అసోసియేషన్ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరిరావు, బాపట్ల జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాలా సాంబిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఐలవరంలో వరల్డ్ యూత్ స్కిల్ డే

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే ఘనంగా నిర్వహించారు. బుధవారం జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం మోహనరావు, ఒకేషనల్ ఇన్‌స్పెక్టర్ చిననాంచారయ్య, తిరుమలదేవి, ఇందిరాదేవిలు విద్యార్థులకు నైపుణ శిక్షణపై అవగాహన కల్పించి వాటి ఉపయోగాలు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత నైపుణ్యాలను పెంచేందుకు చేపట్టే కార్యక్రమాలను నిర్వహించారు. దానిలో భాగంగా డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధానిలో పొట్టిశ్రీరాములు విగ్రహం ఏర్పాటు హర్షణీయం

అమృతలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తమ ప్రాణా లను త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి రంగనాయకుల శ్రేష్టి ఆర్యవైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాములు మెమోరియల్ ట్రస్టుకు రాజధాని ప్రాంతం శాఖమూరులో పార్కు ఏర్పాటుకు 6.8 ఎకరాలు కేటాయించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, కూటమి ప్రభుత్వంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర నాయకులు, కొత్తమాసు రమణకుమార్ తదితరులు కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె,జూలై 16(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో 3వఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్‌ద్వారా విద్యుత్ అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డీఈ డి.శ్యామ్ సుధాకర్‌బాబు తెలిపారు. అయన బుధవారం మాట్లాడుతూ విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా పట్టణంలోని అరవపల్లిరోడ్డు, పెనుమూడిరోడ్డు, కోటసెంటర్, అంకమ్మచెట్టు, గూనివారిపాలెం ఏరియాల్లో, చిన్నఅరవపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

ఉద్యాన శాఖాధికారి ఘన సత్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానశాఖాధికారిగా సేవలు అందించిన జి.జ్యోతిని రైతులు ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని ఓలేరు గ్రామ సచివాలయంలో ఉద్యానవన శాఖాధికారిగా విధులు నిర్వహిస్తూ ఐదేళ్ల పాటు రైతులు విశిష్ట సేవలు అందించడంతో బుధవారం ఆమెను రైతులు, గ్రామ పెద్దలు పూలబొకేలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. భట్టిప్రోలు పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి రమేష్, సర్పంచ్ గంగాధర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని ఓలేరు, గొరికపూడి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏవో బ్రహ్మారెడ్డి పాల్గొని మాట్లాడుతూ, వరి నారు మడుల్లో యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. వెద పద్ధతిలో నాటిన వరి పంటకు 24 గంటల్లో పెండిమిథాలిన్ లీటరు ఎకరాకు పిచికారీ చేసుకోవడం ద్వారా కలుపు రాకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మీప్రసన్న, అఖిల, విహెచ్ఎలు జ్యోతి, కవిత, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు అందజేత

కర్లపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ ఎంపీ రాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు హైదరాబాద్ వలి సహకారంతో 12 కుర్చీలు, ఒక ఇనుప రాక్‌ను గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పఠాన్ అహ్మద్ బాషా, సయ్యద్ రఫీ, మాజీ కో ఆప్షన్ సభ్యులు బాషా, పఠాన్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం

రేపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి) : ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవటం మేలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల అన్నారు. పట్టణంలో ప్రజలకు అవగాహన కోసం రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారంపై బుధవారం ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని చిన్నపాటి తప్పిదాలు క్షణికావేశాలకు లోనుకావొద్దని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవిసాయిశ్రీవాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతాభార్గవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గరికపాటి వెంకటగిరిధర్, కార్యదర్శి యూ.శ్రీనివాసరావు, న్యాయవాదులు కేసన రామస్వామి, సిఐలు మల్లికార్జునరావు, సురేష్‌బాబు, పోలీస్‌సిబ్బంది లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీనిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులను అందిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వైద్యం చేయించుకోలేని పేదలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయనిధితో ఆర్థికంగా ఆదుకోవటం జరుగుతుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని మంత్రి అనగాని 18 మందికి వైద్యం చేయించుకోలేని పేదలకు మంజూరు చేయించిన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.16.50 లక్షలను 18 మందికి మంజూరు చేయటం జరిగిందని, వారికి చెక్కులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి మండల పార్టీ అధ్యక్షులు తాతా ఏడుకొండలు, వడ్డి లక్ష్మీజీ, కొపనాతి రాజశేఖర్, డొక్కు రామకృష్ణ, డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రేపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి) : పురుగుమందులు, విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో పలుదుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది విక్రయాలు చేయాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా 18,500 విలువగల బయోలను సూక్ష్మదాత ఎరువులను నిలుపుదల చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఎ.మహేష్‌బాబు, నవీన్ పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

● చెరుకుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలలో వ్యవసాయ, విజిలెన్సు అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. 1,38,000 రూపాయల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసి వాటి అనుమతి పత్రాలు ఎరువుల లైసెన్స్‌లో పొందుపరిచిన తరువాతనే అమ్మకాలు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ షారూఖ్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఏడీఏలు ఎం.శ్రీనివాసరావు (ఖైలవరం), ఏడీఏ లక్ష్మి(రేపల్లె), జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఏడీఏ మోహన్‌రెడ్డి, విజిలెన్స్ కానిస్టేబుల్ గోపి పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ బృందం ఏడీఏలు పి.శ్రీనివాసరావు, లక్ష్మీ బుధవారం తనిఖీ చేసి ఫారం-ఓ లేని బయో ఉత్పత్తులు రూ.41,010 నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు


ఎక్సరే ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విజయబాబు

వేమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వపరంగా ప్రజలందరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. వేమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎక్సరే ప్లాంటును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి గ్రామాల ప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందించేందుకు అన్ని వనరులతో కూడిన వైద్యశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్, అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు నరహరిబాబు, వేల్పుల రవిబాబు, టీడీపీ నాయకులు వీరాంజనేయప్రసాద్, సుధీర్, ఘంటా శ్రీనివాసరావు, కోగంటి రాజేష్ వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై మైక్రోఫైనాన్స్ వేధింపులు అరికట్టాలి

రేపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి మహిళలపై వేధింపులు, అధిక వడ్డీల వసూళ్ళు ఆపాలని, డ్వాక్రా మహిళల దగ్గర అక్రమ వసూళ్ళు ఆపి అవినీతిని అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. పట్టణంలోని 18వవార్డు ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన మహిళల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజురోజుకు మైక్రోఫైనాన్స్‌సంస్థల రిప్రజెంటీవ్‌లు మహిళల పట్ల ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ అదిక వడ్డీలు వసూలు చేస్తూ బాధలు పెడుతున్నారన్నారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, వి.దనమ్మ, ఎస్కే పర్హానా, వనజాక్షి, కేవీలక్ష్మణ్‌రావు, డి.అగస్టీన్ పాల్గొన్నారు.

కోమలి గ్రామంలో ‘సుపరిపాలనలో తొలి అడుగు’

పిట్టలవానిపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమలి గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకులు కలకోట కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికెళ్ళి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి తెలియజేస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు.. బంగారు బాట

పిల్లల జీవితంలో మొదటి ఐదు సంవత్సరాలు కీలకం. ఈ దశలో వేసే పునాది వారి భవిష్యత్‌కు బంగారు బాట అవుతుంది. దీనిని గురించిన ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 బాల్యా రంభ సంరక్షణ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో నవ చేతన బాల్యా రంభ ప్రేరణ జాతీయ చట్టాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఒక క్రమ పద్ధతి లో బోధన, అభ్యసనకు దృష్టి సారించింది. నవ చేతన, ఆధార శిల పుస్తకాలు రూపొందించి ఉమ్మడి జిల్లాలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది.





అంగన్ వాడీలకు ఆధార్ శిల పుస్తకాలు పంపిణీ

నవ చేతనలో..

నవ చేతన పుస్తకంలో గర్భాధారణ దశ నుంచే మానసిక, శారీరక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. చిన్నారుల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకులు, అంగన్ వాడీ కార్యకర్తలకు ఈ పుస్తకం దోహద పడుతుంది. నేను, నా కుటుంబం, శరీర భాగాలు, ఆహారం, రుచులు వంటి అంశాలను పాఠ్యాంశాలుగా ఇచ్చారు. కార్యకర్తలు మూడు సంవత్సరాల లోపు వారికి వీటిని బోధించటంతో పాటు వారి తల్లిదండ్రులకు వివరించాలి. వారు ఇంటి వద్ద అనుసరించాలి. చిన్నారుల్లో విష పరిజ్ఞానం పెంపొందించేలా కబుర్లు, కథలు ఎలా చెప్పాలనేది వీటిని చిత్రాల సహా ఇచ్చారు.

- నత్తైనపలి

● ఆధార్ శిలలో కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎక్కువగా మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు వయస్సు వారు ఉంటారు. వారికి పాఠ్యాంశాలు వినోదాత్మకంగా ఎలా బోధించాలనే అంశాలను ఆధార్ శిల పుస్తకంలో రూ పొందించారు. ఆడుతూ, పాడుతూ అభ్యాసన జరిగేలా నీతి పద్యాలు వీటిలో పొందు పరిచారు. ఇందులోని ఇతి వృత్తాలు అంగన్ వాడీ కార్యకర్తలకు సహాయ పడేలా రూపు దిద్దారు. నా గ్రామం, నా కుటుంబం, రుతువులు, పండుగలు, పండ్లు, కూరగాయలు ఇతి వృత్తాల ద్వారా పిల్లలు స్థానిక పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవటానికి దోహద పడతాయి.



పుస్తకాలు సరఫరా చేశాం

: ఎం ఉమాదేవి, పీడీ, ఐసీడీఎస్, పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు నవ చేతన, ఆధార శివ పుస్తకాలను సరఫరా చేశాం. ఇందులోని అంశాలను చిన్నారులు తల్లిదండ్రులకు ఎలా తెలియ జేయాలో ప్రాజెక్టుల స్థాయిలో కార్యకర్తలకు అవగాహన కల్పించాం. వీటి ద్వారా పిల్లల భవిష్యత్ సమగ్ర అభివృద్ధి చెందుతుంది.



● కుక్కల కోసం ఏర్పాటు చేసిన ఏసీ హాస్టల్



వసతి.. వారెవ్వా

- కుక్కల కోసం ఏసీ హాస్టళ్లు
- ఆహ్లాదకరంగా డాగీస్ జోన్ల ఏర్పాటు
- నిద్రకు బెడ్లు.. ఆడుకునేందుకు బొమ్మలు

సమాజంలో జంతు ప్రేమికుల సంఖ్య నానాటికీ పెరిగి పోతుంది. ముఖ్యంగా కుక్కలను ప్రాణ ప్రదంగా పెంచుకునే వాళ్లు ఎక్కువయ్యారు. ఏదైనా అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తాము పెంచుకునే కుక్కలను అక్కడా ఇక్కడ వదిలి వెళ్లడానికి కుదరని పరిస్థితి. అటువంటప్పుడు ఎవరో ఒకరు వాటి కోసం ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది. ఈ ఇబ్బందిని నివారించేందుకు కుక్కలకు కూడా ప్రత్యేకమైన హాస్టళ్లు(వసతి గృహం) ఏర్పాటవుతున్నాయి. ఆయా హాస్టళ్లు కూడా ఎలాగంటే అలాకాకుండా అత్యాధునిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలతో నెలకొల్పుతున్నారు.

- గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి

ఆహ్లాదం.. ఆనందం

ప్రాణపదంగా, అపురూపంగా పెంచుకుంటున్న కుక్కలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా డాగీస్ జోన్లు ఏర్పాటవుతున్నాయి. ఇక్కడ 24 గంటలు ఏసీ ఉండేలా జాగ్రత్త తీసుకుంటారు. ప్రతీ కుక్కకు విశాలంగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తున్నారు. అందులోనే పడుకునేందుకు బెడ్, ఆడుకునేందుకు బొమ్మలు ఉంటున్నాయి. వసతిలో ఉండే కుక్కలకు రోజుకు మూడు పూట్ల భోజనం పెడతారు. అది కూడా చాలా విలువైన మెనూ అనే చెప్పవచ్చు. భోజనం పెడుతున్నప్పుడు వీడియో తీసి యజమానికి పంపుతారు. ఉదయం, సాయంత్రం వాకింగ్.. జాగింగ్‌కు కూడా ఏర్పాట్లు చేశారు.

శిక్షణ పొందిన కేర్ టేకర్లు..

డాగీస్ జోన్లలోకి వచ్చే కుక్కల సంరక్షణ కోసం శిక్షణ పొందిన కేర్ టేకర్లను నిర్వాహకులు నియమించుకుంటున్నారు. యజమాని లేకున్నా కుక్క దిగులు పడకుండా కేర్‌టేకర్ల వాటిని మచ్చిక చేసుకుంటున్నారు. ఇక్కడ గంట, రోజు, నెల ఇలా ఎంత సేపు అయినా కుక్కలను ఉంచవచ్చు. చివరికి విదేశాలకు వెళ్లే వాళ్లు మూడు, నా లుగు నెలలు కూడా హాస్టల్‌లో ఉంచి వెళ్ళ వచ్చు. ఆ సమయంలో కుక్కల వసతి తో పా టు, ఆరోగ్య సంరక్షణ, టీకాలు ఇచ్చే విషయం అన్నీ హాస్టల్ యజమానులే చూసుకుంటారు.



కుక్కకు హెయిర్ కటింగ్

ఆంధ్రప్రదేశ్‌లో మొదటగా..



2014లో కుక్కను పెంచుకున్నాను. దానికి ఏదైనా జబ్బు చేస్తే అవసరమైన మందులు అందుబాటులో ఉండేవి కావు. ప్రతి దానికి హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సి వచ్చేది. ఆ సమయంలో వచ్చిన ఆలోచనతోనే గుంటూరు అరండల్‌పేటలో డాగిస్ జోన్ ఏర్పాటు చేశాను. ఆంధ్రప్రదేశ్‌లో కుక్కలకు ఏసీ హాస్టల్ ఏర్పాటు చేయటం ఇదే మొదటిది. ఇక్కడ కుక్కలకు అవసరమైన మందులు, ఆహారం, వసతి, టీకాలు ఏర్పాటు చేశాను. దానికి ఎక్కువ మంది మద్దతు లభించింది. దీంతో కుక్కల కోసం పార్లర్ కూడా నిర్వహిస్తున్నాను.

- షేక్ మగ్బుల్



గోరంట్లలో కుక్కల కోసం డాగీస్ జోన్ పేరు తో ఏర్పాటు చేసిన ఏసీ హాస్టల్

● వ్యాపారంలో వాటా అంటూ మాజీ ఎమ్మెల్యే అనుచరుడి మోసం

వ్యాపారంలో వాటా ఇస్తానంటూ కాకినాడకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు కె రాజభాస్కర్‌రెడ్డి, రూ.1.77కోట్ల మేర మోసం చేశాడని ఆరోపిస్తూ బాపట్లకు చెందిన దొప్పలపూడి విష్ణు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ హయంలో తనపై అక్రమ కేసులు నమోదు చేయడంతోపాటు చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

వినతుల స్వీకరణ.. పరిష్కారానికి హామీ

- 67వ రోజూ మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్
- స్వయంగా కలిసి సమస్యలు విన్నవించిన ప్రజలు

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో బుధవారం 67వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని స్వయంగా కలిసిన మంత్రి వివిధ సమస్యలపై వారినుండి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

☛ కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఏపీ ఐఐసీ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2016లో ప్రభుత్వం భూ ములు సేకరించిందని, ఐతే కొంతమంది రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని గ్రామానికి చెందిన డీ వెంకటరావు మంత్రి లోకేశ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అక్రమాల కారణంగా పరిహారం అందక తాము తీవ్రంగా నష్టపోయామని విచారించి తమకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరి శీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ వైసీపీ ప్రభుత్వంలో తొలగించిన వితంతు పెన్షన్‌ను పునరుద్దరించాలని గుండిమెడకు చెందిన పులపా మంగమ్మ మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో గత 19ఏళ్లగా అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 2400 మందికి హెచ్‌ఆర్ పాలసీ లేదా మినిమమ్ టైమ్ స్కేల్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్ జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామకానికి సంబంధించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



వృద్ధురాలి సమస్య వింటూ..

తిరుపతి నుండి తిరుమలకు పూలు తీసుకెళ్లేందుకు టోల్ గేట్ పర్మిషన్ ఇవ్వాలని శ్రీ బాలాజీ ఫ్లవర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత 30 ఏళ్లగా పూల వ్యాపారం చేస్తున్నామని 2023 ఏడాది నుండి తమకు అనుమతి నిలిపివేశారని మంత్రి దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ శ్రీకాకుళం జిల్లాలో మజ్జిగూడెం ఎత్తిపోతల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని హీర మండలానికి చెందిన గోళ్ల సింహాచలం మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. 2018లో ఎత్తిపోతల నిర్మాణ పనులు ప్రారంభించగా వైసీపీ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ డీఆర్‌డీఏ వెలుగు, చంద్రన్న బీమా కాల్ సెంటర్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీవీడబ్ల్యూవీ, వీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం జీతాలు నిలిపి వేసిందని తమకు పెండింగ్ జీతం చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ సెక్యూరిటీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలువురు ప్రజలు దివ్యాంగుల నుండి మంత్రి లోకేశ్ స్వయంగా అర్జీలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బాపట్ల టౌన్‌హాలుకు 120 వసంతాలు

● 1913లో ప్రథమాంధ్ర మహాసభకు ఇదే వేదిక

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రకమైన బాపట్ల టౌన్‌హాలు నిర్మించి 119 సంవత్సరాలు పూర్తిఅయ్యింది. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు పట్టుగొమ్మగా టౌన్‌హాలు నిలిచింది. జాతిపిత మహాత్మా గాంధీతోపాటు జవహర్‌లాల్‌నెహ్రూ, డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ వంటి ఎందరో జాతీయనాయకులు ఇక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1913 మే నెలలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభకు టౌన్‌హాలు వేదికగా నిలిచింది. బాపట్లలో టౌన్‌హాలు నిర్మించాలని 1902 డిసెంబరు 5న జరిగిన ఓ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అప్పటి తహసీల్దార్ కె.శేషాచలపతిపంతులు ఆధ్వర్యంలో అధికారులు, న్యాయవాదులతో కమిటీ ఏర్పాటైంది. 1903 సెప్టెంబరులో ఎడ్వర్డ్ చక్రవరి పట్టాభిషేకం రోజునే బాపట్ల కోర్టులో జిల్లా మున్సిఫ్‌గా తిరువెంకటాచారి బాధ్యతలు స్వీకరించారు. ఆయన టౌన్‌హాలు నిర్మాణంలో ప్రత్యేక ఆసక్తి చూపారు. అప్పట్లో బాపట్ల తాలూకా మిరాశిదారుగా ఉన్న జాగర్ల మూడినాయుడు ఆధ్వర్యంలో గ్రామ గ్రామం తిరిగి టౌన్‌హాలు నిర్మాణానికి విరాళాలు సేకరించారు. 7,253 రూపాయల 15అణాల 3పైసలు విరాళలుగా వసూలయ్యాయి. జమ్ములపాలెం మిరాశిదారు కుర్రా ముత్తయ్య చౌదరి, న్యాయవాదులు దేశిరాజు కృష్ణయ్యపంతులు, చేరగూడి వెంకటాద్రిపంతులు టౌన్‌హాలు నిర్మాణానికి స్థలం ఇచ్చారు. 1905 జనవరి 24న టౌన్‌హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి బాపట్లతాలూకా సబ్ మేజిస్ట్రేట్ బి.రాజగోపాలరావు, బ్రహ్మాండం బాపయ్యపంతులు వంటి ప్రముఖులెందరో టౌన్‌హాలు నిర్మాణానికి కృషి చేశారు. 1905 జూలై 17న టౌన్‌హాలు ప్రారంభమైన తర్వాత అప్పటికే బాపట్లలో ఉన్న డైమండ్ జూబ్లీక్లబ్, న్యూస్ పేపర్ క్లబ్‌లను ఇందులో విలీనం చేశారు. 1908లో బాపట్లకు జిల్లా మున్సిఫ్‌గా వచ్చిన న్యాపతిబల రాందాసు పంతులు చొరవతో టౌన్‌హాలులో టెన్నీస్ కోర్టు కూడా ప్రారంభమైంది. నిత్యం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో టౌన్‌హాలు అలరారుతుండేది. ఎన్నోనాటిక ప్రదర్శనలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసేవారు. ఈ వా తావరణమే పద్మశ్రీ స్థానం నరసింహారావు, అద్దంకి శ్రీరా మమూర్తి వంటి మ హానటులకు ప్రేరణ ఇచ్చింది.



టౌన్‌హాలు

జడ్పీలో ముదురుతున్న.. అవుట్ సోర్సింగ్ వివాదం

● సీఈఓ ప్రకటనతో అంతా గందరగోళం

గుంటూరు సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ లోని ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులు వ్యవహారం చినికి చినికి గాలి వానలా మారుతుంది. 22 నెలలుగా తమకు జీతాలు చెల్లించటం లేదంటూ జడ్పీ లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వ హించిన విషయం విదితమే. ఆ ధర్నా వ్యవహారం పై స్పందించిన సీఈఓ జ్యోతి బసు అసలు వాళ్లు జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే కాదంటూ సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో బుధవారం వ్యవహారం మరింత వేడెక్కింది. జీతాలు ఇవ్వటం లేదంటూ ధర్నా నిర్వహించిన ఉద్యోగులు జిల్లా పరిషత్‌లోని కీలకమైన ఛాంబర్‌లలో విధుల్లో ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. వాళ్లు జడ్పీ ఉద్యోగులు కాకుంటే అక్కడ ఎందుకు ఉన్నారంటూ పలువురు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు.



జడ్పీలో విధుల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



● జిల్లా పరిషత్‌కు తాళాలు తీసేది వాళ్లే...

ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యవహారంలో అధికారులు చెబుతున్న మాటలు అవాస్తవాలు అని బాధితులు చెబుతున్నారు. ప్రతి రోజూ జిల్లా పరిషత్ తాళాలు వేసేది.. తీసేది అవుట్ సోర్సింగ్ ఉద్యోగి హరీష్ అని చెబుతున్నారు. అతను కొంతకాలం ప్రస్తుత జడ్పీ సీఈఓ ఇంట్లో కూడా వాచ్‌మెన్ గా పని చేసినట్లు తెలుస్తున్నది. గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల కమాండ్ కంట్రోల్ రూమ్, పీ ఎఫ్ సెక్షన్, ఇతర కీలకమైన సెక్షన్‌లలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రాంగణం, ఛైర్మన్ క్యాంపు కార్యాలయం శుభ్ర పరచటం వంటి పనులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్నారు. 365 రోజులు విధులకు హాజరై పనులు చేస్తున్నా వాళ్లు ఉద్యోగాల్లో లేరని సీఈఓ ప్రకటన చేయటం వివాదాస్పద మయ్యింది.

● 2022 లోనే తీర్మానం...

అవుట్ సోర్సింగ్ విధానంలో 10 మందిని నియమించేందుకు అప్పటి కలెక్టర్ అనుమతితో జిల్లా పరిషత్ లో 2022 జనవరి 28న తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింప జేశారు. నియమించిన ఉద్యోగులకు జడ్పీ నిధుల నుంచి చెల్లింపులు చేసేలా తీర్మానంలో పేర్కొన్నారు. ఆ తీర్మానం ఆధారంగానే ఈ ఆరుగురుని విధుల్లో నియమించారు. 2023 వరకు జీతాలు కూడా సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించారు. మోహన్‌రావు డిప్యూటీ సీఈఓ గా పనిచేసిన కాలం లో 2023 జూలై 21 వ తేదీన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు విభాగాలను కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. 2023 లో వారిని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి, జీతాల చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. కొందరిని రోజు వారీ వేతనం కింద విధుల్లోకి తీసుకుంటున్నట్లు మోహన్ రావు ఇంచార్జి సీఈఓ గా ఉన్నప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఆ లెక్క న ప్రస్తుతం జిల్లా పరిషత్ లో ఉన్న ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చట్ట ప్రకారం విధుల్లో ఉన్నట్లుగానే స్పష్టం అవుతున్నది.



కార్మెల్ కొండ.. అద్భుతాల నిలయం

● కార్మెల్‌మాత మహోత్సవాల్లో గోవిందుజోజి

ఫిరంగిపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనేక అద్భుతాలకు నిలయంగా కార్మెల్ కొండ భాసిల్లుతుందని నల్గొండ విశ్రాంత పీఠాధిపతి గోవిందుజోజి తెలిపారు. ఫిరంగిపురంలో కార్మెల్ మహోత్సవాలు బుధవారం మూడో రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల భక్తులు లక్షలాదిగా తరలివచ్చి మహోత్సవాల్లో పాల్గొని తరించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించి తలనీలాలు తీయించుకున్నారు. కార్మెల్ మాత స్వరూపానికి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గోవిందు జోజి ఆశీర్వదించారు. అనంతరం సమిష్టి దివ్య పూజాబలిలో గోవిందు జోజి భక్తులకు సందేశ మిచ్చారు. సకల మానవాళి మాతగా మరి యతల్లి వెలుగొందు తుందన్నారు. జపమాల, ఉత్తరీయంతో మాత ను ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నారు. కార్మెల్ కొండ కు ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను బాల ఏసు కథెడ్రల్ దేవాల య ఫాదర్ మాలపాటి ఫాతి మామరెడ్డి కోరారు.



దివ్య పూజాబలిలో ప్రసంగిస్తున్న నల్గొండ విశ్రాంత పీఠాధిపతి గోవిందుజోజి

అవీ..ఇవీ..

ఘనంగా కిట్టీ స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవం



కిట్టీ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మహిళ సభ్యులు

చీరాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతిఒక్కరూ ఆనందంగా ఉంటూ ఇతరులకు సహాయపడాలని కిట్టీ స్వచ్ఛంద సంస్థ మహిళ సభ్యులు ఇస్తర్ల సుభాషిణీ అన్నారు. బుధవారం ముంతావారి సెంటర్‌లో కిట్టీ స్వచ్ఛంద సంస్థ 25వవార్షికోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ వృత్తుల్లో స్థిరపడిన, సమాజా సేవా దృక్పథంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలోనే నిరుపేద లక్ష్మమ్మకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అంతేకాకుండా ఆమె ఇరువురు సంతానంకు సంబంధించి నూతన వస్త్రాలను అందజేశారు. అంతాసమానమేననే ఉద్ధేశ్యంతో ఒకే రంగుతో కూడిన వస్త్రాలు ధరించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సభ్యులు రాజ్యలక్ష్మీ, విజయకుమారి, రమాదేవి, భాను తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పు చేసి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 4వ రోజుకు చేరుకొంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఏర్పాటు చేసుకున్న శిబిరం వద్ద వంటా - వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు వి.జాన్, కార్యదర్శి సామ్యూలు, మార్కు, ఇతర కార్మికులు లక్ష్మి, భీష్మా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆదాం తదితరులు సంఘీభావం తెలిపారు.

టీబీ అనుమానితులు కళ్లే పరీక్ష చేయించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీహర్ష

అద్దంకిటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీబీ అనుమానంగా ఉన్న ప్రతి ఒక్కరు సంబంధిత వైద్యశాలలో కళ్లే పరీక్ష చేయించుకోవాలని డాక్టర్ శ్రీ హర్ష అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మయపాలెం పీహెచ్‌సీలో 104 వాహనం వైద్యులు, సిబ్బంది క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ హర్ష టీబీ డిపార్ట్‌మెంట్ ద్వారా 100 రోజులు టీబీ ముక్త్ భారత్ పోగ్రాంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధికి సంబంధించి పూర్తిగా ఉచితంగా సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ వ్యాధికి మందలు వాడే క్రమంలో నిక్షయ్ పోషణ యోజన నిమిత్తం, ప్రతి నెల రూ.100 బాధితుల అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పీపీఎం సమన్వయకర్త రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీలు

పంగులూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ సంస్థల నుంచి అవసరాల కోసం తీసుకున్న అప్పు తిరిగి చెల్లించ లేదంటూ తాము నివ సించే ఇళ్లకు తాళాలు వేసి వేదిస్తున్నారని తహసీల్దార్ సింగారావు, బైట మంజులూరు గ్రామ ఎస్సీ, ఎస్టీలు మొరపెట్టుకున్నారు. తమ కుటుంబ అవసరాల కోసం, వ్యవసాయ పెట్టుబడులు కోసం మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పు తీసుకున్నామని తెలిపారు. తీసుకున్న అప్పులో కొంత మొత్తం చెల్లించామన్నారు. పంటలు పండక, తీసుకున్న కుటుంబ యజమాని మృతిచెందడంతో కిస్తీలు చెల్లించ లేక పోయా మన్నారు. అప్పు తీసుకునే సమయంలో ఇంటిని తాకట్టు పెట్టారనే నెపంతో తాము నివసించే ఇళ్లకు తాళాలు వేసి ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఇబ్బంది పెడుతున్నారని తమకు రక్షణ కల్పించాలంటూ గ్రామానికి చెందిన సీ.హెచ్.నాగార్జున, నవీన్, గోవర్ధన్, యహోషోవా, సీతమ్మ, చిన్నమ్మాయి మరికొందరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు.

సంక్షేమ పథకాలపై ఇంటింటికి ప్రచారం



పథకాలపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ తిరుపతమ్మ, నేతలు

అద్దంకి, జూలై16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో అమలు చేసిన పథకాలు గురించి బుధవారం అద్దంకి పట్టణంలోని 4 వ వార్డులో కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాగులూరి గోపాలకృష్ణమూర్తి, దూళిపాళ్ల వెంకటరత్నం, శివకుమారి, బాచిన సురేష్‌బాబు, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి టీడీపీ కార్యకర్త కాలరెగరేసేలా పాలన

ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

చీరాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అబద్ధమని అంబేడ్కర్ రాజ్యాంగం ప్రకారమే టీడీపీ కార్యకర్త కాలరెగరేసుకునేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిపాలన సాగిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్ స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్యలు పేర్కొన్నారు. ఆధ్వర్యంలో బుధవారం కిరాణా మర్చంట్ అసోసియేషన్ మండపంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో మత్స్యకారులకు వేట విరామం సమయంలో రూ.10 వేలు ఉండగా రెట్టింపు చేసి రూ.20 వేలు అందించినట్లు తెలిపారు. అలాగే చేనేతల సమస్యలు గుర్తించి 200 యూనిట్‌లు ఉచిత విద్యుత్‌తో పాటు, ముడి సరుకుపై జీఎస్టీ ఎత్తివేసినట్లు వివరించారు. పొగాకు రైతులకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా మెగా డీఎస్సీతో 20 వేలకు పైగా నిరుద్యోగలకు ఉద్యోగాలు, ఆగస్టులో ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నట్లు వివరించారు. అదనంగా రైల్వేలైన్‌లు, ఒంగోలు పాసింజర్ రైలు పునః ప్రారంభించినట్లు చెప్పారు. వందేభారత్‌ను చీరాలకు స్టాప్ కలిగించేలా చూస్తున్నట్లు చెప్పారు. కుక్కతోక వంకర అన్నచందంగా వైసీపీ నేతలు బుద్ధిమాలిన చర్యలు చేస్తూ వివాదాలు సృష్టిస్తున్నట్లు వివరించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు వివరించి అభివృద్ధి జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ కొతవరపు జనార్ధనరావు, పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'రప్పా.. రప్పా' అంటే రప్పాడించేస్తారు..!

చీరాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జగన్ రెడ్డిని జనం ఇంటికే పరిమితం చేసినా బుద్ధి రావడం లేదని, ఖాళీగా ఉండి సినిమా డైలాగులు వల్లెవేస్తున్నారని బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి విమర్శించారు. 'రప్పా రప్పాకాదు, జనంలోకి వస్తే జగన్‌ను రప్పాడిస్తారు' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం చీరాల్లో ఓ సభలో వైసీపీ పార్టీ వ్యవహారశైలిపై నిప్పులు చెరిగారు. జగన్‌హయాంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోనికి నెట్టారన్నారు. వైజాగ్‌లో రూ.500 కోట్లుతో కుటుంబ సభ్యులకు అభీష్టం మేరకు బంగ్లా నిర్మించుకున్నాడన్నారు. పోలవరం పూర్తి చేస్తామని ఆ ప్రభుత్వంలోని ఓ మంత్రి అసెంబ్లీ సాక్షిగా తొడలు కొట్టాడని, అయితే అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కూడా లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాల న లో పరిశ్రమలు లేవని పెట్టుబడులు అంతకన్నా లేవు. నిరుద్యోగులకు మొండి చేయి చూపి అబద్దపు ప్రచారాలకే పరిమిత మయినట్లు వివరిం చారు. సిట్ విచారణలో రూ.3500 కోట్లు లిక్కర్ స్కాం బయట పడిందని చెప్పారు. అప్పులు మిగిల్చి నేరస్థుల పరామర్శలకు బాటలు వేసినట్లు చెప్పారు. గతప్రభుత్వం హయాంలో రేపల్లె రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాంపై మహిళపై అత్యాచారం జరిగినప్పుడు పరామర్శ లేదు. చెరుకుపల్లిలో బాలుడిని సజీవదహనం చేసినప్పుడు పరామర్శల్లేవు. తెనాలిలో పలు కేసుల్లోని నేరస్థులను జగన్ పామర్శించడం సిగ్గుచేటని అన్నారు. కూటమి ప్రభుత్వ పరిపాలన ఓర్వలేకే జగన్ చీకట్లో చంపేయండి, పట్ట పగలు వేసేయండి, రప్పా రప్పా చేయండని సినిమా డైలాగులు చెబుతున్నట్లు మంత్రి దుయ్యబట్టారు.

మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నరేంద్రకు అభినందనలు



నరేంద్రను అభినందిస్తున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు దేవినేని నరేంద్ర వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌కు ఎంపిక కావడంతో బుధవారం సంతమాగులూరులో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్‌లు హజరయ్యారు. ఈసందర్భంగా బల్లికురవ మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ పార్టీ శ్రేణులు ర్యాలీగా సంతమాగులూరు మార్కెట్ యార్డుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ తేలప్రోలు రమేష్, వైస్ చైర్మన్ దేవినేని నరేంద్రకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మార్కెట్ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. వైస్ చైర్మన్‌కు అభినందనలు తెలిపిన వారిలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జాష్టి వెంకటనారాయణ బాబు, నేతలు జాష్టి శ్రీరంగ నాయకులు, మలినేని గోవింద రావు, గొట్టిపాటి లక్ష్మయ్య, శంకర్, ఆళ్ల చంద్రమౌళి, గాయిత్రి ఇండస్ట్రీస్ అధినేత దేవినేని శ్రీనివసారావు, దేవినేని వేణుబాబు, చిట్టిపోతు నరేంద్ర, గొట్టిపాటి మారుతి, గోగినని వేణుబాబు, ఆలోకం సురేష్, కోడెల శ్రీనివాస్, మలాల్దఇ వేణుగోపాల్, చెరుకూరి హరిష్, గరికపాటి సుబ్బారావు, మానం శ్రీధర్, సీటి సంఘం అధ్యక్షులు యాగంటి సింగరయ్య, కక్కెర సుబ్బారావు, మామిళ్లపల్లి ప్రవీణ్, దద్దాల అంజయ్య అమరనేని కాశీయ్య తదిత రులు వైస్ చైర్మన్‌కు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పుమాగులూరు గ్రామంలో బుదవారం రాత్రి వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మధ్యవర్తిత్వం ద్వారా కక్షలు కార్పణ్యాలకు చెక్



ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి ప్రశాంతి, న్యాయవాదులు

పర్చూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా కక్షలు కార్పణ్యాలకు చెక్ పెట్టవచ్చని మధ్యవర్తిత్వ న్యాయవాధి ఎం.రవీంద్రనాధ్ రెడ్డి అన్నారు. కక్ష్యలు కార్పణ్యాలకు పోయి జీవితాన్ని వృధా చేసుకోవద్దన్నారు. మధ్య వర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో సీనియర్, జూనియర్ న్యాయాధికారులు కె.ప్రశాంతి, పి.శాంతి పాల్గొన్నారు. కోర్టు భవనాల సముదాయం నుండి స్థానిక బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈకార్యక్రమంలో బార్‌అసోషియేషన్ అధ్యక్షులు పూరిమెట్ల జాన్‌బాబు, కార్యదర్శి షేక్.రుక్సానా, కోశాధికారి కరి ప్రవీణ్, సీనియర్ న్యాయవాధులు రావి సత్యన్నారాయణ, రావి శ్రీనివాసరావు, రాఘవయ్య, రమణి, ధనలక్ష్మి, కొమ్మాలపాటి రవి, స్థానిక కోర్టు సిబ్బంది పాలొన్నారు.

మూత'బడి'లు

(5వ పేజీ తరువాయి)

మూతపడే పరిస్థితి ఉందని అధికారులకు తెలియజేశారు. దీంతో వెంటనే కొంతమంది ఉపాధ్యాయులను కొన్ని పాఠశాలల్లో అధికారులు సర్దుబాటు చేశారు.

వలంటీర్లను నియమించినా..

మూడు జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడే పరిస్థితులు నెలకొనడంతో కొన్ని ప్రాంతాల్లో వలంటీర్లతో సరిపెడుతున్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు సహకారంతో విద్యా వలంటీర్లను నియమించిన అత్యధిక పాఠశాలల్లో ఇంకా ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉంది. వెల్దుర్తి మండల పరిధిలోని పాఠశాలల్లో అసిస్ట్ అనే సంస్థ 16 మంది విద్యా వలంటీర్లను నియమించిందని వెల్దుర్తి ఇన్చార్జి ఎంఈవో ఖాసిం తెలిపారు. వారికి నెలకు రూ.8000 చెల్లించేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు.

క్లస్టర్లలో ఖాళీగా ఉపాధ్యాయులు

బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని క్లస్టర్ పరిధిలో ఖాళీలను కోరుకుని అతి తెలివి ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడాల్సి ఉండగా క్లస్టర్ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు ఒక క్లస్టర్ పరిధిలో పదిమంది ఉపాధ్యాయులు ఉంటే ఆ క్లస్టర్లో పరిధిలోని పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే అక్కడికి వెళ్లి పాఠాలు బోధించాలి. అయితే దాదాపు 200 మందికి పైగా ఉపాధ్యాయులు క్లస్టర్లలో ఖాళీగా ఉంటూ కాలం వెళ్లదీస్తున్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. గుంటూరు నగరం నుంచి మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు దాదాపు 30 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇందులో పదిమంది క్లస్టర్ ఉపాధ్యాయులు ఉన్నారు. బదిలీ అయిన క్లస్టర్ ఉపాధ్యాయుల్లో ఇద్దరు మాత్రమే విధుల్లో చేరగా ఎనిమిది మంది విధుల్లో చేరలేదు. సాక్షాత్తు విద్యామంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లోనే ఇలా ఉందంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వైసీపీని వీడి బిజేపీలో చేరిక



బీజేపీలో చేరుతున్న జువ్వి రాము

అద్దంకి, జూలై16(ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి, శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జువ్వి రాము బుధవారం విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, నేతలు పరుచూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి యలమంద రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి సత్యకుమార్, మధకర్‌జీ, ఆర్.శ్రీనివాస్‌లను కలిశారు.

మించాలకే మున్సిపల్ పీఠం

(5వ పేజీ తరువాయి)

బయటకు వెళ్లిపోగా 20 మంది టీడీపీకి మద్దతిచ్చిన కౌన్సిలర్లు, 5 గురు ఆమంచి వర్గీయులు, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే కొండయ్యతో కలుపుకుని మొత్తం 27 మంది మించాలకు అనుకూలంగా ఓటేయ డంతో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు చైర్మన్‌గా సాంబశివరావు ఎన్నికైనట్లు ప్రకటించి బాధ్య తలు అప్పజెప్పారు. వైస్ చైర్మన్ ఎన్నిక గురు వారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు

ఫలించిన బుజ్జగింపులు

ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్యలు కౌన్సిలర్ పోత్తూరు సుబ్బయ్య ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించారు. పార్టీలో భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు ఉంటాయని, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని సుబ్బయ్యకు నేతలు వివరించారు. చైర్మన్ మించాలతో కలిసి పట్టణ అభివృద్ధికి పనిచేయాలని కోరారు. దీనితో మెత్తబడిన ఆయన సాయంత్రం చీరాల పార్టీ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌కు హాజరవడంతో కథ సుఖాంతమైంది.

గుండ్లకమ్మ నుంచి సాగునీరు విడుదల చేయాలి

మద్దిపాడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలకు సాగునీరు అందించాలని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, తెలుగు రైతుసంఘం అధ్యక్షుడు రావి ఉమామహేశ్వరరావు, కాకర్ల విజయ్‌కుమార్ బుధవారం జిల్లా అధికారులను కలిసి విన్నవించారు. రైతులు జామ తోటలకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల గుండ్లకమ్మ కాలువలకు సాగునీరు విడుదల చేసి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్యాలు అవసరం



విజేతలైన విద్యార్థులతో హెచ్ఎం గంగాధరరావు

అద్దంకిటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు పలు రకాల విద్యల్లో నైపుణ్యం సాధించాలని హెచ్ఎం పి.గంగాధరరావు అన్నారు. మంగళవారం ప్రపంచ యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు వృత్తి ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు పతకాలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, ఎస్‌కె.ఆలీ, వి.యలమంద తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహం



ప్రతిభచాటిన వారిని అభినందిస్తున్న గ్రామ పెద్దలు

పంగులూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాలలో గత ఏడాది ఎన్ఎంఎం పోటీ పరీక్షలో ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులకు ఎన్ఆర్ఐ గుంటుపల్లి రాజేంద్ర, పఠాన్ కాలేషావలిఖాన్‌లు నగదు ప్రోత్సాహం అందించారు. రాజేంద్ర రూ.12 వేలు, కాలేషావలిఖాన్ రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందించగా, గ్రామపెద్దలు ఆ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.వేణుబాబు, గ్రామపెద్దలు తాటి సుబ్బారావు, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న అధికారులు

ఇంకొల్లు, జూలై 16, (ఆంధ్ర జ్యోతి) : రైతులు వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగు బడులతో లాభాలు పొందాలని బాపట్ల జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.ఉషా సూచించారు. ఇంకొల్లు కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గ్రోమోర్ కంపెనీ సహకారంతో నానో ఎరువుల వినియోగంపై బుధ వారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఎం ఉషా మాట్లాడుతూ పంట సాగులో నానో ఎరువుల వినియోగం ప్రాధాన్యతను వివరించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఎక్కువ మోతాదులో ఎరువుల వాడకాన్ని తగ్గించి లాభాలు పొందాలన్నారు. రైతుల సందేహాలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డా.ఆకాష్, చక్రవర్తి, గ్రోమోర్ సంస్థ ప్రతినిధులు, మోహన్, హరినారాయణ, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం అందజేత



చిన్నారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఇంకొల్లు, జూలై 16, (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారికి ఇంకొల్లు ఐసీడీఎస్ సిబ్బంది దాతృత్వంతో రూ.25 వేలు నగదు బుధ వారం ఆ కుటుంబసభ్యులకు అందజేశారు. ఇంకొల్లు అంకమ్మకాలనీకి చెందిన బత్తుల శ్రీను, అఖిల దంపతుల రెండవ కుమారుడు తరుణ్ ఊపిరితిత్తుల కేన్సర్‌తో బాధపడుతుండగా వారి ఆర్థిక పరిస్థితి దీనస్థితిలో ఉంది. దీంతో సీడీపీవో సులోచనరాణి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తరుణ్ వైద్యఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. దాతలు సహకరించి తరుణ్ ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు శ్రీను, అఖిల వేడుకున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ

చినగంజాం, జూలై 16(ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సందిర్శించి, ఆశలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు నిర్వహించాలన్నారు. గర్భిణులు, పోస్టనేటల్ 0-5 సంవత్సరాల పిల్లలు నమోదు చేసి వారికి తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌సీడీ, అబ్బా ఐడీలు వెంటనే పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. లెపర్సీ, టీబీ కేసులకు చికిత్సను కొనసాగించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికిన్‌గున్యా, వ్యాధులకు సంబంధించిన కేసులు రాకుండా ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ప్రతి సచివాలయం నందు తాగునీరు నమూనాలను పరీక్షలు చేయాలన్నారు. 104 సర్వీస్ నందు ఎక్కువ మందికి సర్వీసులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో 104 నోడల్ అధికారి బీవి.బ్రహ్మాం, వైద్యాధికారులు పీ.సాయిశ్రీచరణ్, సీ.హెచ్.సిరివెన్నెల, హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, 104 డీఈవో పాదిలి రాఘవ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంలో జలజీవన్ మిషన్ పనులు



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్

అద్దంకి, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని కొటికలపూడి పంచాయతీ పరిధిలోని పార్వతీపురంలో జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ. 30 లక్షలతో చేపట్టిన ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పైప్ లైన్ పనులు చేపట్టారు. పనులను బుధవారం కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్ పరిశీలించారు. త్వరలో మిగిలిన పనులను పూర్తి చేసి ఇంటింటికి కులాయిల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలి

యద్దనపూడి,(మార్టూరు)జూలై16: రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని, లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలును కొనుగోలు చేయాలని ఏవో కుమారి అన్నారు. బుధవారం యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగి వారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాలలోని రైతులను ఉద్దేశించి కుమారి మాట్లాడారు. అధికారుల సిఫారుసు మేరకే రైతులు పొలాలకు రసాయనిక ఎరువులను వినియోగించాలన్నారు. రబీలో శనగ సాగుచేసే రైతులు ప్రస్తుతం పొలాలను ఖాళీగా ఉంచకుండా, పచ్చిరొట్టగా, పెసర, మినుము పంటను సాగు చేసుకోవాలన్నారు. అదే విధంగా రబీలో శనగ పంటను సాగు చేసుకోవాలన్నారు. అయితే శనగలో వచ్చే ఎండు తెగులు నివారించడానికి పంటమార్పిడి పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుదర్శిని రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

సంతమాగులూరు జులై 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా టీడీపీ ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజవరపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని పుట్టావారిపాలెం గ్రామంలోని సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు రూ.270 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రైతులకు ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన ప్రతి హామీని అమలుజేస్తోందన్నారు. గత వైసీపీ హయాంలో రాష్ట్రంలో




హాజరైన రైతులు

పాలన భ్రష్టుపట్టింద న్నారు. నాడు వైసీపీ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్క రోజైనా తాడేపల్లి గడప దాటి జనంలోకి రాలేదన్నారు. జగన్ లాంటి దుర్మార్గపు నాయకుడిని తాను చూడలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం ద్వారా రూ.32 వేల కోట్లను దోచుకున్నారన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ సంతమాగులూరు, బల్లికురవ మండలాల పరిధిలోని రైతులు ఇబ్బంది పడకుండా పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పెన్షన్లకు రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచే ప్రసక్తే లేదన్నారు. జగన్ సొంత కారు కింద కార్యకర్త పడి మృతిచెందితే ఆ పార్టీ కార్యకర్తను పట్టించుకన్న దాఖాలు లేవన్నారు. పరామర్శల తోటే కాలం వెల్లదీస్తున్నారన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు తెలియని వైసీపీని ఎన్నికల కమిషన్ గుర్తింపు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ముందుగా నాయకులు, కార్యకర్తలు అడ్డరోడ్డు జంక్షన్ లో మంత్రులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, వైస్ ఛైర్మన్ దేవినేని నరేంద్ర 14 మంది డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, నాగినేని రామకృష్ణ, అద్దంకి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పద్మ, చేవూరి వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, అట్లా చిన్నవెంకటరెడ్డి, గ్రామ సర్పంచి గురుయాదవ్, ఆలూరి శ్రీనివాసరావు, చింతా రామారావు, బత్తుల రామకోటయ్య, చల్లా కృష్ణ, కొణికి గోవిందమ్మ, దూపాటి ఏసోబు, నాగబోతు సుజాత, కొప్పాక కొండలు, డి గాలెయ్య, పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మంత్రి అచ్చెనాయుడు, పక్కన రవికుమార్, ప్రమాణం చేస్తున్న రమేష్



గుంటూరు	:నాజ్‌అప్సర థియేటర్
గుంటూరు	:హరిహరమహల్
గుంటూరు	:ఫోనిక్స్‌మాల్ (మైత్రి)
ఒంగోలు	:గోరంట్ల సినిమాస్
తెనాలి	:మిని సంగమేశ్వర
చీరాల	:సురేష్‌మహల్
నరసరావుపేట	:లక్ష్మీ నరసింహాడీలక్స్
రేపల్లె	:రాజ్యలక్ష్మీ
మాచర్ల	:వెంకటేశ్వర
అద్దంకి	:మిని వి.ఎస్.ఎస్

పారదర్శకంగా పొగాకు కొనుగోళ్లు

మార్క్‌ఫెడ్ డీఎం కరుణ శ్రీ

పర్చూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పారదర్శకంగా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేపడుతున్నామని మార్క్‌ఫెడ్ బాపట్ల జిల్లా డీఎం కరుణశ్రీ అన్నారు. నల్లబర్లీ పొగాకు సాగులో పర్చూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందు వరసలో ఉందన్నారు. నల్లబర్లీ పొగాకు రైతులకు మేలు చేకూర్చేందుకే ప్రభుత్వం కొనుగోలుకు శ్రీకారం చుట్టిందన్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా రైతుల వద్ద 74,000 టన్నులు పొగాకు నిల్వలు ఉన్నాయన్నారు. అందులో మార్క్‌ఫెడ్ ద్వారా 20,000 టన్నుల పొగాకు కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఆ మేరకు కొనుగోలుకు సంబంధించి ఇప్పటికే 30 కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రోజుకు 300 నుండి 400 వందల క్వింటాలు కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే 3,400 టన్నుల నల్లబర్లీ పొగాకును రైతులవద్ద నుండి కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించి నగదు రైతుల ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.



కరుణ శ్రీ

ఖాళీ గోదాముల అద్దెకు ప్రకటన

పర్చూరు : పొగాకును స్టోరేజ్ చేయడానికి 10,000 చదరపు అడుగుల నుండి 1,00,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఖాళీ గోదాములను అద్దె ప్రాతిపదికన తీసుకుంటున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగులు ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుల వద్ద సుమారు 74 వేల మెట్రిక్ టన్నుల పొగాకు ఉంటుందని అంచనా ఉండగా, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో గోదాములు సరిపోయే పరిస్థితి లేదని మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. గోదాములు అద్దెకు ఇవ్వదలచిన వారు ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఆవులదొడ్డి గొల్లపాలేన్ని మోడల్ విలేజ్‌గా అభివృద్ధి చేస్తా

● మండల స్థాయి అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

చినగంజాం, జూలై 16 (ఆంధ్ర జ్యోతి) : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్ల పాలెం గ్రామాన్ని మోడ ల్ గ్రామంగా తీర్చిదిద్దేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అద్భుత ప్రణాళికలు రచించాలని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని గొనసపూ డి గ్రామంలో మండలస్థాయి అధికా రులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా గ్రామాన్ని సందర్శించి గ్రామ అభివృద్ధికి బాటలు వేశారన్నారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేలా అన్ని శాఖలు పగడ్బందీ ప్రణాళికలతో మందుకు సాగాలన్నారు. ఇప్పటికే గ్రామంలో సిమెంట్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటింకి సోలార్ సిస్టం ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి గ్రామంలో అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో వసతులు కల్పించేలా అద్భుత ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి సమస్యలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు నీరు ఎక్కడ నిల్వ లేకుండా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల న్నారు. కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటినందించాలని ప్రణాళికలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి పైపులైను నిర్మాణం చేపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్లస్థలాలు అందిస్తామన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలో అర్హులకు ఇంటి స్థలాలు అందించేందుకు శరవేగంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ జె.ప్రభాకరరావును ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్రం నారాయణరావు, మండల టీడీపీ అధ్యక్షులు పొద వీరయ్య, బత్తుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏ.ఈలు డి.దాసు, బసవరాణి, ఏపీఎం జి.పెదసుబ్బారావు, ఏపీవో జె.లక్ష్మీదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

రేపు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యద ర్శులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈవో

మార్టూరు, జూలై16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని బుధవారం యంఈవో వస్రాంనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను, స్కూల్ బ్యాగ్‌లను సక్రమంగా పంపిణీ చేశారా..? అని ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు శ్రీనివాసరావు, తిరుపతమ్మలు పాల్గొన్నారు.